నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, మంగళవారం 29 ఏప్రిల్ 2025 | NIZAMABAD

- 'వరంగల్ సభ' దిగ్విజయవంతం
- కనీవిని ఎరుగని రీతిలో ప్రజా స్పందన
- చరిత్ర పుటల్లోకి బీఆర్ఎస్ రజతోత్సవ వేడుక
- కార్యకర్తలకు నేనున్నాంటూ అధినేత కేసీఆర్ భరోసా
- ఉమ్మడి జిల్లాలో విజయోత్సవాలు
- ఎల్కతుర్తి సభతో బెంబేలెత్తుతున్న కాంగ్రెస్, బీజేపీ

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా పురుడుపోసుకున్న బీఆర్ఎస్ 25వ వసంతంలోకి అడుగిడింది. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వేదికగా బీఆర్ఎస్ రజతోత్సవం ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభకు పార్టీ అధినేత, తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకాగా..రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిమంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. రజతోత్సవ సభ కనీవిని ఎరుగని రీతిలో విజయవంతం కావడం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని గులాబీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బీఆర్ఎస్‌పై ప్రజలు ఎనలేని ఆదరాభిమానాలు చూపడంతో నాయకులు, కార్యకర్తల్లో సరికొత్త జోష్ కనిపిస్తున్నది. పార్టీ అధినేత ప్రసంగాన్ని ఉమ్మడి జిల్లాలోని ప్రజలు, అభిమానులు టీవీలు, మొబైల్‌లో ఆద్యంతం ఆసక్తిగా వీక్షించారు.

–నిజామాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# బీఆర్ఎస్.. ఫుల్ జోష్!

## ఆనందోత్సాహాల్లో గులాబీ శ్రేణులు




తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడంలో రేవంత్ రెడ్డి సర్కారు ఘోరంగా విఫలమైంది. ఇచ్చిన ఏ ఒక్కహామీని కూడా అమలుచేయకపోవడంపై సబ్బండ వర్ణాలు మండిపడుతున్నాయి. కాంగ్రెస్ పాలనతీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సర్కారుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న జనాలు బీఆర్ఎస్ నిర్వహించిన రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చి కేసీఆర్‌కు జై కొట్టారు. ఎల్కతుర్తి సభా వేదిక నుంచి కేసీఆర్ అనేక ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అశేష జన వాహిని సాక్షిగా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కుండబద్దలు కొట్టడంతో బీఆర్ఎస్ నాయకత్వంలో జోష్ కనిపిస్తున్నది. అంచనాలకు మించి సభ విజయవంతం కావడంతో గులాబీ శ్రేణులు విజయోత్సవాలు నిర్వహించుకుంటుండగా.. కాంగ్రెస్, బీజేపీలో వణుకు మొదలైంది.

### నేనున్నానంటూ.. కార్యకర్తలకు భరోసా...

బీఆర్ఎస్ కార్యకర్తలకు, సోషల్ మీడియా వారియర్స్‌కు నేనున్నానంటూ కేసీఆర్ భరోసా ఇచ్చారు. ఎల్కతుర్తి సభా వేదికపై నుంచి పోలీసుల తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ ఉంటుందన్న విషయాన్ని ఖాకీలు గుర్తుంచుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అక్రమంగా కేసులు బనాయించి ఇబ్బందులు పెడితే న్యాయ పరంగా పోరా టం చేసి కాపాడుకుంటానంటూ కేసీఆర్ హామీ ఇచ్చారు. పోలీసుల వేధింపులను ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ పార్టీ అం డగా నిలుస్తుందన్న నమ్మకం ఏర్పడడంతో, పార్టీశ్రేణుల్లో ధీమా వ్యక్తమవుతున్నది. బీఆర్ఎస్ లీగల్ సెల్ ఎల్లప్పుడూ న్యాయ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటుందనడంతో గులాబీ నేతలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఆలోచింపజేసిన అధినేత ప్రసంగం

భారీ బహిరంగ సభలను నిర్వహించడంలో బీఆర్ఎస్ ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తున్నది. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకూ అనేక సభలను నిర్వహించిన చరిత్ర గులాబీ పార్టీకి ఉంది. స్వరాష్ట్ర సాధనలో భాగంగా భారీ బహిరంగ సభలను నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేసిన కేసీఆర్... సరిగ్గా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ చేతుల్లో చిక్కిన తెలంగాణను రక్షించేందుకు నడుం బిగించారు. ఏడాదిన్నర దాటుతున్నా, ఇచ్చిన హామీలను అమలు చేయలేక చతికిల పడిన హస్తం పార్టీ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రజతోత్సవ సభలో గులాబీ బాస్ ప్రసంగం ఆలోచింపజేసింది. తనదైన శైలిలో వాగ్బాణాలు సంధిస్తూనే అధికార కాంగ్రెస్, బీజేపీ తీరును ఎండగట్టారు. తెలంగాణకు కలుగుతున్న నష్టాన్ని సూటిగా ఎత్తి చూపారు. రైతు భరోసా, రుణమాఫీ, సాగు, తాగు నీరు, నిరంతర విద్యుత్, సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుతున్నాయా? అంటూ కేసీఆర్ ప్రశ్నించగా, సభకు హాజరైనవారితోపాటు టీవీల్లో కేసీఆర్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న వారు కూడా ప్రతిస్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తిని వెళ్లగక్కారు.



ఖలీల్‌వాడి, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ రతజోత్సవ సభ జయప్రదం కావడంపై జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, పార్టీ నాయకులు మురళి, రాజు, శంకర్ సంతోషం వ్యక్తంచేశారు. సోమవారం వారు జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ ఆవిర్భావ సభను అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో విచ్చేసి, విజయవంతం చేసిన జిల్లా ప్రజలు, ఉద్యమకారులు, నాయకులు, కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలిపారు



నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 28 : వరంగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులు, జిల్లా ప్రజలకు నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా కృతజ్ఞతలు తెలిపారు. రజతోత్సవ సభకు అర్బన్ నుంచి 52 బస్సులు, 252 కార్లు, 3,500మందికిపైగా కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులకు భోజనం, తాగునీటితో పాటు మజ్జిగ అందించినట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పేర్కొన్నారు.

### జీర్ణించుకోలేని కాంగ్రెస్



-మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ రజతోత్సవ సభ భారీసక్సెస్ కావడం, అనుకున్న దానికన్నా ఎక్కువ జనం రావడం కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతున్నదని, అందుకే మంత్రులు, నాయకులు అడ్డగోలుగా వాగుతున్నారని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సభకు లక్షలాదిగా జనం తరలిరావడం, కేసీఆరే మళ్లీ రావాలి అంటూ నినాదాలు చేస్తూ నిండు మనసుతో మద్దతు తెలపడం చూసి జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు.. ఆగమేఘాల మీద సభ సక్సెస్ కాలేదని ప్రెస్‌మీట్లు పెడుతూ స్వీయ ఆనందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ సభ గ్రాండ్ సక్సెస్ అని అన్ని పత్రికలు, టీవీలు రాశాయని, అందులో బీఆర్ఎస్‌కు మద్దతు తెలపని పత్రికలు టీవీలు కూడా ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మాత్రం కండ్లు ఉండి చూడలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 17 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డిపై వచ్చిన వ్యతిరేకత, సభకు లక్షలాదిగా తరలివచ్చిన ప్రజల్లో స్పష్టంగా కనిపించిందని, అందరూ మళ్లీ కేసీఆర్ రావాలని అంటున్నారని తెలిపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సభను విజయవంతం కాకుండా కుట్రలు చేయాలని చూశారని ఆరోపించారు.ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజల నుంచి తప్పించుకోలేదని, ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు గ్రామాల్లో ఎక్కడికక్కడ ప్రజల పక్షాన నిలబడి నిలదీస్తారని స్పష్టం చేశారు. రజతోత్సవ సభకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని 9 నియోజకవర్గాల నుంచి 40 వేలమందికిపైగా ప్రజలు హాజరయ్యారని తెలిపారు.సభ విజయవంతానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే వేముల కృతజ్ఞతలు తెలిపారు.

### ఎందుకంత అక్కసు?



బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి/నందిపేట్, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లా నుంచి సబ్బండ వర్గాలతోపాటు పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చారని పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నరు. వేలాదిగా తరలివచ్చిన జిల్లా ప్రజలు, సబ్బండ వర్గాలకు పార్టీ నేతలు శ్రేణులకు పాదాభివందనాలు అని, రజతోత్సవ సభ విజయవంతంలో భాగస్వాములైన వారందరికి ధన్యవాదాలు తెలిపారు.

#### బీఆర్ఎస్ సభ సక్సెస్‌పై కాంగ్రెస్‌కు ఎందుకంత అక్కసు ?

బీఆర్ఎస్ రజతోత్సవ సభలో విస్కీ బాటిళ్లే కనిపించాయని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలపై జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు విస్కీ బాటిళ్లా ?, సభా ప్రాంగణమంతా ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసిన లక్షలాది మంది ప్రజలు కనిపించలేదా ? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సభ సక్సెస్‌పై కాంగ్రెస్‌కు ఎందుకంత అక్కసు ? అని మండిపడ్డారు. పీసీసీ చీఫ్ వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పాలన చేతకాక విపక్షంపై నోరు పారేసుకుంటున్నారని, సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయి లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఆల్ టైమ్ బ్లాక్ బస్టర్ హిట్ అని సంతోషం వ్యక్తం చేశారు. సభ జరగకుండా సర్కారు పెద్దలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా సబ్బండ వర్గాలు, బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చి గులాబీ జెండా పవర్ చూపించాయన్నారు. ఎన్నికలెప్పుడు జరిగినా ఇందిరమ్మ హింసా రాజ్యానికి ప్రజలు చరమగీతం పాడడం, ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సంక్షేమ రాజ్యానికి స్వాగతం పలుకడం ఖాయమని వరంగల్ సభ చాటి చెప్పిందని పేర్కొన్నారు.

### మళ్లీ వచ్చేది బీఆర్ఎస్సే..



-నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

బాన్సువాడ, ఏప్రిల్ 28: కేసీఆర్‌ను మించిన నాయకుడు లేడని ప్రజలు గమనిస్తున్నారని, ప్రతిపక్షంలో ఉన్న పార్టీ సభకు లక్షలాదిమంది స్వచ్ఛందంగా తరలివచ్చారని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అనతి కాలంలోనే అట్టర్ ప్లాప్ అయ్యిందని విమర్శించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బాన్సువాడ నియోజకవర్గం నుంచిపెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు, ప్రజలకు ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. సభ సక్సెస్ కోసం కృషి చేసిన పార్టీ నాయకుడు జుబేర్‌తో పాటు కార్యకర్తలను అభినందించారు. రాబోయే రోజులు బీఆర్ఎస్ పార్టీవే అని, కాబోయే సీఎం కేసీఆర్ అని బాజిరెడ్డి ధీమా వ్యక్తంచేశారు.

#### స్వలాభం కోసం పార్టీ మారిన పోచారం

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్లే మోసగాడు పోచారం శ్రీనివాసరెడ్డి అని విమర్శించారు. మళ్లీ బీఆర్ఎస్‌లోకి రావడానికి ప్రయత్నాలు సాగిస్తున్నాడని పలువురు అంటున్నారని, కానీ ఎట్టి పరిస్థితిల్లో ఆయనను పార్టీలోకి రానిచ్చే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. బాన్సువాడలో బీఆర్ఎస్ పార్టీ పక్షాన నిలిచే వారికే భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ఇటీవల నియోజకవర్గానికి ఎమ్మెల్సీ కవితతో కలిసి వచ్చి స్థానికంగా చేసిన అభివృద్ధి పనులు, మంజీరపై నిర్మించిన చెక్‌డ్యాంలను సందర్శించామని, అవన్నీ కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు వివరించారు. పోచారం కష్టకాలంలో బీఆర్ఎస్‌కు మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన పార్టీ మారడంపై ఇతర పార్టీ నాయకులు కూడా ఇంత పెద్ద మోసమా అని జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఆయన తప్ప మరో నాయకుడిని ఎదగనివ్వలేదని విమర్శించారు.

### పనిచేయని కుట్రలు



- జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

బిచ్కుంద, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ రజతోత్సవ సభను ఎలాగైనా అడ్డుకోవాలని దుష్టపన్నాగం పన్ని, రహదారులను దిగ్బంధం చేసినా పార్టీ కార్యకర్తలు,ప్రజలు తండోప తండాలుగా తరలివెళ్లి విజయవంతం చేశారని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. వరంగల్ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు వెళ్లకుండా ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, బెదరకుండా వారి కుట్రలను పటా పంచలు చేసి తరలివెళ్లారని తెలిపారు. రజతోత్సవ సభకు భారీగా తరలివెళ్లి విజయవంతం చేసిన జుక్కల్ నియోజక వర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# నడిచొచ్చిన న్యాయస్థానం

### మానవతాదృక్పథంతో స్పందించిన న్యాయమూర్తి తీరుపై ప్రశంసలు

బోధన్, ఏప్రిల్ 28: నడవలేని స్థితిలో విచారణ కోసం ఆటోలో వచ్చిన వృద్ధ దంపతుల వద్దకే న్యాయమూర్తి వచ్చి ఎగ్జామినేషన్ చేశారు. కోర్టు విచారణ కోసం ఓ వృద్ధ దంపతులు బోధన్‌లోని అదనపు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ కోర్టుకు సోమవారం వచ్చారు. వారు కోర్టు హాల్‌లోకి నడిచివచ్చే స్థితిలో లేరని తెలుసుకున్న న్యాయమూరి ఇ.సాయిశివ తానే స్వయంగా కోర్టు హాల్ నుంచి బయటికి వచ్చారు. కోర్టు భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆటోలో ఉన్న వృద్ధ దంపతులను ఎగ్జామినేషన్ చేశారు. దీనిని చూసిన కోర్టుకు వచ్చిన కక్షిదారులు, ప్రజలు సంతోషం వ్యక్తంచేశారు. మానవతాదృక్పథంతో స్పందించిన న్యాయమూర్తిని ప్రశంసించారు.



కోర్టు హాల్ బయటికి వచ్చి ఆటోలో ఉన్న వృద్ధ దంపతుల నుంచి నిలబడి స్టేట్‌మెంట్ తీసుకుంటున్న బోధన్ ఆదనపు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి సాయిశివ

# గులాబీ జెండా మాయం!




- ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు
- కామారెడ్డి పోలీసులకు ఫిర్యాదుచేసిన నాయకులు

కామారెడ్డి, ఏప్రిల్ 28 : జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో ఆవిష్కరించిన బీఆర్ఎస్ జెండాను గుర్తుతెలియని వ్యక్తు లు ఎత్తుకెళ్లారు. పార్టీ నాయకుడు వెంకటి తెలిపిన వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా పార్టీ నాయకులు ఆదివారం గులాబీ జెండాను ఆవిష్కరించి, వరంగల్ సభకు తరలివెళ్లారు. సోమవారం ఉద యం జెండా వద్దకు వెళ్లి చూసే సరికి జెండాతో పాటు జెండాక ర్రను కూడా ఎత్తుకెళ్లారు. ఈ విషయమై కామారెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెంకటి తెలిపారు

# రుణమాఫీ చేయండి సార్..!

### నిజామాబాద్ కలెక్టర్‌కు చిన్న,సన్నకారు రైతుల మొర



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

రెంజల్, ఏప్రిల్ 28 : 'మేము సన్న, చిన్నకారు రైతులం..రుణమాఫీకి అర్హులం.. మాకు రుణమాఫీ చేయండి సార్..' అంటూ నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో మొరపెట్టుకున్నారు పలు గ్రామాల రైతులు. రెంజల్ మండల కేంద్రంలో భూభారతిపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని తిరిగివెళ్తుండగా.. రెంజల్, దూపల్లి గ్రామాల రైతులు చుట్టుముట్టారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన సన్నకారు, చిన్నకారు రైతులకు రుణమాఫీ వర్తింపజేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వేడుకున్నారు. రెంజల్‌లో గన్నీ సంచులు, లారీల కొరత తీర్చాలని కోరారు. అలాగే దూపల్లికి చెందిన ఓ మహిళ తన అర ఎకరం భూమి కబ్జాకు గురైందని, న్యాయం కోసం కలెక్టరేట్‌తోపాటు తహసీల్ ఆఫీస్ చుట్టూ తిరిగి విసిగి వేసారిపోయినట్లు కలెక్టర్‌తో మొర పెట్టుకున్నది. తనకు న్యాయం చేయాలని కోరింది.

# మామ మందలించాడని హత్య

నవీపేట, ఏప్రిల్ 28: తన కూతురును వేధించవద్దని అల్లుడిని మందలించినందుకు మామను హతమార్చిన ఘటన మండలంలోని అనంతగిరి గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. హ త్యకు సంబంధించి వివరాలను ఎస్సై వినయ్‌తో కలిసి నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ సోమవారం వెల్లడించారు. చత్తీస్‌గఢ్ కు చెందిన బిలమ్‌సింగ్(48), కూతురు గోమతి, అల్లుడు రాజేశ్, తమ్ము డి కుమారుడు రాజేంద్రతో కలిసి బతుకుదెరువు కోసం నిజామాబాద్ జిల్లా కు వచ్చారు. నవీపేట మండలం అనంతగిరి గ్రామంలో కొత్తగా గోదాముల నిర్మాణం కొనసాగుతుండగా కృష్ణ అనే మేస్త్రి వద్ద పనిలో చేరారు. తన భార్య మృతిచెందడంతో బిలమ్‌సింగ్.. కూతురు, అల్లుడి వద్దే ఉంటున్నాడు. కొంతకాలంగా రాజేశ్, గోమతి మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో భార్యను వేధింపులకు గురిచేస్తూ తరచూ ఘర్షణ పడేవాడు. ఈ క్రమంలో తన బిడ్డను మంచిగా చూసుకోవాలని, ఎందుకు వేధిస్తున్నావని బిలమ్‌సింగ్ అల్లుడిని నిలదీశాడు. దీంతో మామపై కక్ష పెంచుకున్న రాజేశ్ ఈ నెల 27న మద్యం తాగివచ్చి భార్య గోమతితో ఘర్షణకు దిగాడు. తన కూతురును మళ్లీ ఎందుకు వేధిస్తున్నావంటూ రాజేశ్‌ను బిలమ్‌సింగ్ మందలించాడు. దీంతో రాజేశ్ తాగిన మైకంలో గోదాం ఆవరణలో నిర్మాణానికి వినియోగించే ఇటుకలతో బిలమ్‌సింగ్ తలపై దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. బిలమ్‌సింగ్ తమ్ముడి కొడుకు రాజేంద్ర ఫిర్యా దు మేరకు నిందితుడు రాజేశ్‌ను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

# భర్త హత్యకు రూ.15 లక్షల సుపారీ




కామారెడ్డిలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

- ప్రియుడితో కలిసి భార్య పన్నాగం
- ఆట కట్టించిన కామారెడ్డి పోలీసులు

కామారెడ్డి, ఏప్రిల్ 28: ప్రియుడి మోజులో పడిన ఓ ఇల్లాలు భర్తకే ఎసరు పెట్టింది. కట్టుకున్న వాడిని ఖతం చేసేందుకు రూ.15 లక్షల సుపారీ ఇచ్చింది. దుండగులు హత్యాయత్నానికి పాల్పడుతుండగా అటువైపు కొందరు రావడంతో భర్త తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. రంగంలోకి దిగిన పోలీసులు భార్య, ప్రియుడితో సహా ఐదుగురిని అరెస్టు చేశారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలో జరిగిన ఈ కేసు వివరాలను ఎస్పీ రాజేశ్‌చంద్ర సోమవారం విలేకరులకు వెల్లడించారు. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన సాడెం కుమార్ మెదక్ మున్సిపాలిటీలో పని చేస్తున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి సమీపంలోని లలితమ్మ గుడిలో పూజారి కాంపల్లి మహేశ్‌కు, కుమార్ భార్య రేణుకకు వివాహేతర సంబంధం ఏర్పడింది. అయితే, తమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన మహే శ్, రేణుక.. కుమార్‌ను హత్య చేయడానికి కుట్ర పన్నా రు. అనంతరం అతడి ఆస్తిని అనుభవించాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. కుమార్ హత్య కోసం అల్వాల్‌కు చెందిన మహ్మద్ అశ్వక్‌కు రూ.15 లక్షలు సుపారీ ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అశ్వక్ అనుచరులైన ముబీన్, అమీర్, అన్వర్, మోసిన్లకు అడ్వాన్స్‌గా రూ.2 లక్షలు ఇచ్చారు. కుమార్ రోజులాగే ఈ నెల 21వ తేదీన డ్యూటీకి బయల్దేరాడు. అప్పటికే అశ్వక్ గ్యాంగ్ అతడి హత్యకు ప్లాన్ వేసింది. ఫరీద్‌పేట శివారులోని సోలార్ ప్లాంట్ వద్ద హత్య చేయడానికి అనువుగా ఉంటుందని అక్కడే మాటు వేసింది. కుమార్ రాగానే మహేశ్, అశ్వక్, అతని అనుచరులు ముబిన్, అమీర్, అన్వర్, మోసిన్ కలిసి దాడి చేశారు. రాడ్లతో విచక్షణారహితంగా కొట్టి తీవ్రంగా గాయపరిచారు. అదే సమయంలో ఓ కారులో వచ్చిన ఇద్దరు హత్యాయత్నాన్ని గమనించగా, నిందితు లు పరారయ్యారు. గాయపడ్డ కుమార్‌ను కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. దీనిపై ఏఎస్పీ చైతన్యారెడ్డి నేతృత్వంలో పోలీసులు దర్యాప్తు చేపట్టగా, భర్త హత్యకు భార్య కుట్ర పన్నిన విషయం వెలుగు చూసిం ది. దీంతో రేణుకతో పాటు మహేశ్, అశ్వక్, ముబి న్, అమీర్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి కారు, ఆటో, గొ డ్డలి, రెండు బైక్‌లు, నాలు గు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. వారం రోజుల్లోనే ఈ కేసును ఛేదించిన కామారెడ్డి రూరల్ సీఐ రామన్, మాచారెడ్డి ఎస్సై అనిల్, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.